# జీవితం

## 'తాయమ్మ' కరుణ

కథ

నాకు ఆరోగ్యం బాగాలేక అమ్మ దగ్గర వుంటున్నానుగానీ ఏమాత్రం లేచి తిరగ్గలిగినా నా ఉద్యోగం చేసుకుంటూ నా మానాన నేను వుండేదాన్ని. దాదాపు బెడ్ రెస్ట్‌లో ఉంటున్న. మా అమ్మ ఒక్కర్తే ఉంటోంది. మా అమ్మకు ఎనిమిది మంది పిల్లలం- ఐదుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలం. అందరి పెళ్ళిళ్ళు అయిపోయాయి. మా అమ్మ ఒక్కర్తే ఎందుకుంటోంది అని అడిగితే నేను చెప్పలేను. రాయాలంటే రెండు మూడు నవలలే అవుతాయి. కాబట్టి దాని జోలికి వెళ్లను. మా అమ్మ ఒక్కర్తే ఉంటుందన్నాను గద. అందుకే నేను వచ్చాక గుంజకు కట్టేసిన మేకపిల్లలాగా నా చుట్టూ తిరుగుతోంది. అంతకు ముందులాగ ఎవరిళ్లకు వెళ్లటం లేదు. ఎంతసేపని మాట్లాడ తాం, వింటాం. చెప్పండి. అదీగాక రోజుకు ఇరవైనాలుగు గంట లు సరిపోని నేటి పరుగుల జీవితంలో నా మంచికో చెడ్డకో ఆరోగ్యం బాగాలేక మా అమ్మ దగ్గర వుంటున్న. కాస్సేపు చదువుకుందామన్నా, రాసుకుందామన్నా చేసుకోనివ్వదే. ఒకటే ముచ్చట. లేదంటే ఎదురుగా కూచుంటది. మా అమ్మ ఎందుకలా ఉంటుందో నాకర్థమవుతోంది. కానీ విసుగ్గా కూడా వుంటోంది. ఇంతకీ మా అమ్మ వయసు చెప్పలేదు డెబ్బై ఒకటో యేడు.

నిజమే, మేం చంటిపిల్లలుగా ఉన్నప్పుడు పగలంతా రెక్కలు ముక్కలు చేసుకునే అమ్మను కంటినిండా నిద్ర పోనిచ్చేవాళ్లం కాదు. ఒక్కరమా ఇద్దరమా? ఎనిమిది మందిమి. ఎన్ని సంవత్సరాలు మా అమ్మ కంటినిండా నిద్ర పోలేదో, అయినా ఓపిగ్గా గుండెలకద్దుకొని పాలిచ్చి నిద్రపుచ్చింది. కూడైనా కుదురుగా తిననిచ్చేవాళ్లం కాదు. మాకో ముద్ద పెడుతూ తనో ముద్ద తింది. ఎత్తుకోలేదని గోల చేసి ఏడిస్తే ఒక చేత్తో ఎత్తుకుని ఒంటిచేత్తో పనులు చేసింది. పిల్లలను ఒక్క దెబ్బైనా కొట్టేది కాదని, కన్న కష్టం చేసుకుంట అంత ఓపిక ఎక్కడ్నించి వచ్చిందో అని ఆశ్చర్యంతో అనేవాళ్లు - మా అమ్మ గురించి జనాలు.


వయసు పెరిగినా కొద్దీ మా అమ్మ చిన్నపిల్లవుతోంది. పిల్లలమైన మా వెనకాల చంటిపిల్లలాగా తిరుగుతోంది. మాతో గడపాలనీ, మేము తనను పలకరించాలనీ చూస్తది. అన్నీ అర్థమైనా పట్టీపట్ట నట్టుగా ఉంటాం. మా అమ్మంత ఓపిక మాకెక్కడిది. ఒకటి రెండుసార్లు పలకరిస్తాం. కాసేపు వింటాం 'సహనంతో'. మా అమ్మ ఇంకా మాట్లాడాలని చూస్తే చిరాకనిపిస్తుంది. వినకున్నా ముచ్చట చెప్తుంటే వినుగేసి కసిరిస్తాం. ఎనిమిది మందిని కన్న మా అమ్మ ముసలితనాన ఒంటరిది. మేం పిల్లలుగా ఎంత గొడవ చేసినా మా అమ్మ సహనంతో భరించిందిగానీ మా అమ్మ ముసలితనపు మానసిక రుగ్మ తలను తట్టుకునే స్థితిలో మేమెక్కడున్నాం. మా అమ్మకు మేము ఎలాగూ తల్లులం కాలేము. అందుకోసం ప్రయత్నం కూడా చెయ్యం. అసలా ఆలోచనే మా అమ్మ పిల్లలకు లేదు.

ఈ వారం రోజులుగా నన్ను రాసుకోనివ్వ దు, చదువుకోనివ్వదు. అందుకే ఈరోజు ఎలాగైనా రాసుకోవాలని పెన్ను, పేపరు ముందరేసుకుని ఆలోచిస్తూ కూచున్న. మా అమ్మ వచ్చి ఎదురుగ్గ కుర్చీలో కూచుంది. నేనేమీ పలకరించలేదు. కొద్దిసేపు చేతులు పిసుక్కుంది. బాల్కనీలోకి వెళ్ళి నిలబడి. రోడ్డంటా కాస్సేపు చూసి వచ్చి మళ్లీ కూర్చుంది. అయినా నేను పట్టించుకోలే దు. నన్ను నెమ్మదిగ ముచ్చట ముగ్గులోకి లాగడానికన్నట్టు "ఊర్ల బొడ్రాయి లేపుతరంటనే" అన్నది.

"బొడ్రాయి లేపుడేందే" అన్నాను. నేనెప్పుడు వినలేదు దాని గురించి.

"బిడ్డా! నేనింక పెద్దమనిషిగాలె. నేను తాతీకల్లు ఊర్లనే ఉన్న. ఊర్ల జనాలు ఒగరి తర్వాత ఒకరు ఆరుగురు, పిట్టల్లెక్క రాలి పోయింద్రు. ఓ నొప్పి లేదు. ఓ జరం లేదు. 'ఊరికి అరిష్టం బట్టింది. బొడ్రాయి లేపాలి' అన్నరు. బొడ్రాయి లేపుడంటే చిన్న మాటనా. ఊరు ఊరంతా ఒక్కటి గావాలె. ఒక్కమాట మీద నిలవాలె. పెద్ద మనుషులు చెప్పినట్టు వినాలె. మీ తాత ఊర్ల పెద్ద మనిషాయె. ఊరంత చందాలేసుకున్నరు. గుండిగలతోటి అన్నం వండిన్రు. పెద్ద దున్నపోతును నరికింద్రు. ఆ దున్నపోతు రక్తాన్ని అన్నానికి కలిపింద్రు. చంద్రంలెక్క ఎర్రగ అన్నం. అందరు తలుపు లేసుకోవాలని, ఆడోళ్ల బయటకు రావద్దని ముందుగాలనే డప్పు సాటింపు యేయించిండ్రు. ఎవరన్న ఆడది కనిపిస్తె గెదిమేటోళ్ల. నాది చిన్నతనమాయె. డప్పు సప్పుడుకు సూద్దామని సిన్నగ మిద్దె యెక్కిన. దున్నపోతు దొబ్బలను బైండ్లోడే నోటితో పట్టుకుని ఊరు సుట్టు తిరగాలి. ఇంకో కులపోడు ఈ పని చేయడు.

బైండ్ల పిచ్చోడు ఒళ్లంతా పసుపు రాసుకుని, కుంకుమతోటి బొట్లు పుదించుకొని బరిబత్తల ఉండి, మొల సుట్టు యేపాకు మండలు కట్టుకుని ఎర్రటి పెద్ద పెద్ద దున్నపోతు దొబ్బలను నోటితోటి పట్టుకు ని, జుట్టంత ఇరబోసుకుని డప్పు సప్పుళ్లకు షిగ మూగుతుంటె యెనకంగ నిమ్మకాయలను కోసి పడేసుకుంట, నెత్తురు గలిపిన యెర్రటి అన్నం సల్లుకుంట పోతుంటే... బిడ్డా! దడవు పుట్టింది.



అట్లనె చూస్తున్న. నన్ను జూసి పెద్దగ కేకలేసింద్రు లోపలికి బొమ్మని".

"బొడ్రాయి ప్రతి ఊరుకు ఉంటాదె"


"ఆఁ ఉంటది బిడ్డా"

"ఊరి బయట ఉంటదా, ఊరి మధ్య ఉంటదా"

"నకిరేకల్లుల ఊరి బయట ఉండె. ఇప్పుడు ఊరు పెద్దదయి బొడ్రాయి ఊరి మధ్యకయ్యింది. రాటికంట్ల ఊరి మధ్యనే ఉంది. బొడ్రాయి సుట్టు కొంచెం దూరం వరకు ఆ జాగల వ్యవసాయం జేయరు, ఇల్లు కట్టరు. ఆ జాగను అమ్మరు, కొనరు. మీ నాయినకు అట్లాంటి నమ్మకాలేవీఁ ఉండేటివికావుగా... కోమటి ఎంకనర్సు దగ్గర కొన్నడు. అది అట్లనే వుంది ఇప్పటికీ".

ఇంక నేను విషయాన్ని పొడిగించదల్చుకోలేదు. ఇక ఈరోజు కూడా రోజులాగే అయితదని మౌనంగా వున్నాను. మా అమ్మ కూడా అలాగే కొద్దిసేపు కూచుని "పొద్దుటి ఛాయ్ వుంది. తేనా బిడ్డా" అన్నది. తీసుకురమ్మని తలూపిన.

ఛాయ్ తీసుకొచ్చి ఇచ్చి కూచుంది. నేను ఛాయ్ తాగుతుంటె "మొన్న బక్కలచ్చమ్మ సచ్చిన్నాదు. జనం తిర్నాలా బిడ్డ" అన్నది.



అమ్మ ఇక ఇట్లనే ఎన్ని రోజులయిన చెప్తది. టైం పన్నెండు కావ స్తుంది. రాసుకుందామ నుకున్నది పక్కన పెట్టినగని కాసేపు చదువు కుందామన్నా వదిలేటట్టు లేదు. దాహం గొన్నట్టుగ చెప్తుంది. పరిస్థితి అర్థమవుతుంది. కానీ నాకు మళ్ల ఇలాంటి ఖాళీ సమయం దొరకదు. మా అమ్మను లేపుదామనే ఉద్దేశంతో లేచి బాత్రూమ్‌కి వెళ్లిన.

ఛాయ్ తాగుకుంటనే పెన్ను, పేపరు ముందు నుండి తీసి పక్కకు పెట్టిన.

"ఏం జనం వచ్చిన్రే. ఊరు ఊరంతా కదిలొచ్చింద్రే. ఏం సక్కని సావు సచ్చింది. గుండెల నొప్పొస్తుందే అన్నదంట. దావఖానాకు తీసుకుపోతే మా వల్ల కాదన్నరంట. హైదరాబాదు వచ్చేసరికే సచ్చి పోయిందట" అని రెండు చేతులు పైకెత్తి దండం పెట్టి "నాకెట్లాంటి సావస్తదో బిడ్డ" అని మళ్లా కొనసాగించింది.

"ఎరుకలోల్లు, మాదిగోల్లు, గౌండ్లోల్లు, ఒక్కరనేంది. ఏం జనం! ఏం జినం! నేను పోయేసరికి ఎరుకలోల్ల పిల్ల వెంకటమ్మ చెట్టుకింద కూసొని ఏడుస్తోంది. నన్ను జూసి గుర్తుపట్టి 'నాకు బిడ్డ పుట్టిందని తెల్సి ఆఁవుదం సీసా రెండు రైకముక్కలు నా ఇంటికి తెచ్చిచ్చింద మ్మా నా తల్లి' అని బక్కలచ్చిని గుర్తు చేస్కుంట ఏడ్చింది. మనదేం కులం, ఆల్లదేం కులం? అయినా మా కాలంల గింత అన్యాయం లేదు. ఎవరికన్న ఆపద వుందంటే కలిగినదాంట్లో ఇంత పెట్టేటోళ్లం. ఇయ్యాళ రేపు ఇంటికిపోతె గూడ గింత ఛాయ్‌నీళ్ళు పోస్తలేరు" అని కాసేపు ఆగి "సాయం జేసినా గింత గుర్తు పెట్టుకోరే. రైకగుడ్డలు, ఆఁవుదం ఇచ్చిందని ఆ ఎరుకలోల్ల పిల్ల ఎంత గుర్తు పెట్టుకుని యాజ్జేసుకుని ఏడుస్తుంది" అని, "బక్కలచ్చి, నేను కట్టెలకు పోయి నా, కలుపు దీయబోయినా, గడ్డి గోయబోయినా ఓ... ఒగరి కష్టాలు ఒగరం జెప్పుకొని ఏడ్చేటోళ్లం. ఒగరి కొకరం ఊకించుకునేటోళ్లం" అని కండ్లనీళ్ళు కొంగుతోటి తుడుచుకుంది.

ఇక ఈ పూట కూడా మా అమ్మకే అంకితం అవ్వాలనుకున్న. తను ఇంకా చెబుతోంది. విందామనే మా అమ్మనే చూస్తూ కూచున్న.

"గౌండ్లోల్ల నర్సక్కకు కాల్లేతులు పడిపాయె బిడ్డ" అంది.

"అవునానె" అన్నాను. పది పన్నెండేండ్లుగా నేను మా వూరికి వెళ్ల లేదు. అమ్మ ఈ మధ్యనే పోయి వచ్చింది.

"ఎన్నాండ్లాయె మంచంలపడి. తిండి పెట్టేటోడు గూడ లేడాయె. బక్కగ ఎట్లయిందనుకున్నవ్? మీ చిన్నతనాన నర్సక్క వయసు మీద ఉండె. రెండు ముక్కులకు రెండు బేసర్లు, చెవులకు ఇంతింత యెద ల్పటి రాళ్లదిద్దులు, మెడల మెత్తటి నాను, పెద్దగొలుసు, నల్లపూసలు, చేతులకు బంగారపు దండెకడాలు, నడుముకు వడ్డాణం, కాళ్లకు పట్టా గొలుసులు, కడియాలు, సాలం కడియాలు, చేతులనిండా గాజులు, రూపాయి బిళ్లంత బొట్టు పెట్టుకుని నూనె బెట్టి నున్నగా దువ్వి కొప్పేసుకుని అడుగు దీసి అడుగేసి నడుస్తుంటే... బిడ్డా...! ఏఁవం దం... ఏం సుంగారం... అట్లాంటి మనిషి మొన్న పోయినపుడు 'సావన్న రాదాయె పెద్దమ్మ' అని ఏడ్చింది. 'ఆనాడు ఎంత సుఖపడ్డ వో ఈనాడు అంత కష్టపడుతున్నవ్ బిడ్డ' అని ఏడ్చి".

వింటూ వుంటే ముచ్చట తర్వాత ముచ్చట అట్ల చెబుతూనే వుంటది అమ్మ.

"సాకలోల్ల బుచ్చవన్న భార్య సైదమ్మ ఇద్దరు మొగపిల్లలు వుట్టి నంక ఎవనెంటనో బాయె. చిన్నపిల్లలను ఒదిలిపెట్టి ఎట్ల పోబుద్ధి అయిందో దానికి. పిల్లలు పెద్దగయినంగ మల్లొచ్చె.

"బుచ్చవన్న రానిచ్చినాడే"

"యాడ రానిచ్చిండు. ఇద్దరు కొడుకుల పెండ్లి జేసె. ఎవనికి వాడు యేరే వుంటున్నరు. బుచ్చవన్న, ఆళ్లమ్మ రావక్క ఇద్దరు కల్సి ఒండుక తింటున్నరు. పెద్దోడికి తల్లి మీద ప్రేమ. వాడే తల్లికి నాల్గు డబ్బులిస్తడేవోఁ... వారం, వారం మాంసంకూర పంపుతడేవోఁ...

కాస్సేపాగి...

"తాటి సాంబన్ని ఆని పెద్దకొడుకు శీనుగాడు కొట్టిండంట. సాంబని ముందల పండ్లన్ని యిరిగినయే. 'అక్క మీ కండ్ల ముందల యెంత కష్టంజేస్తి. తాగిన్నా, తిన్ననా, ఓ... బట్ట కట్టిన్నా' అని మొన్న పోయినపుడు పట్టుకొని యేడ్చిండు. దయ్యాల్లెక్క మొగడు, పెండ్లం కారం మిల్లు బట్టిరి. పిండిమిల్లు బట్టిరి. మిషన్ గుట్టె. వారం వారం అంగట్ల బట్టల బేరం జేసె. ఇయ్యాళ పోరగాడు అన్ని కొడ్తాడే. ఇయ్యాళ రేపు పోరగాండ్లకు అద్దు లేకుంట అయింది".

అమ్మ ఇక ఇట్లనే ఎన్ని రోజులయిన చెప్తది. టైం పన్నెండు కావ స్తుంది. రాసుకుందామనుకున్నది పక్కన పెట్టినగని కాసేపు చదువు కుందామన్నా వదిలేటట్టు లేదు. దాహం గొన్నట్టుగ చెప్తుంది. పరిస్థితి అర్థమవుతుంది. కానీ నాకు మళ్ల ఇలాంటి ఖాళీ సమయం దొరకదు. మా అమ్మను లేపుదామనే ఉద్దేశంతో లేచి బాత్రూమ్‌కి వెళ్లిన. నా తర్వాత మా అమ్మ కూడా బాత్రూమ్‌కి పొయ్యొచ్చి కూచుని మళ్లా మొదలుపెట్టింది. నా ఒళ్లోని వరలక్ష్మిగారి 'అతడు–నేను' కథల పుస్తకం మూసేసిన.

"నా చిన్నతనాన బక్కగ, పండ్లెత్తుండి ఇకారంగ ఉండేదన్ని. పేడంత ఎత్తుకొచ్చి పెంట మీద యేసేదాన్ని".

"అంత పేడ ఏం జేసేటోళ్లే"

"పొలానికి" అని, "నేను ఎప్పుడన్న పోనంటె ఇన్ని చెనక్కాయలు పెట్టి 'మా రంగి మంచిది కదు' అని మా అమ్మ అనంగనే పోయేదా న్ని. అట్లనే ఒసారి పెండతట్టల చెనక్కాయలు బోసుకుని తినుకుంట బోతున్న అమ్మమ్మోళ్ల ఊరు మాదారంల. ఓ ఆంబోతు జూసి నా యెంటబడ్డది. పిట్టలెక్క యేం వురికిన. ఉరుక్కుంట పెండతట్ట బడేసిన.

తట్ట దగ్గరికి రాంగానే తట్టల చెనక్కాయలు జూసి ఆంబోతు తిను కుంట ఆగింది బిడ్డ. అది ఆగినా నా కదుపుల బయం జొరబడి అట్లనే ఉరుకుతుంటె కుమ్మరంతయ్య జూసి 'ఏందె బొర్ర రంగి ఉరుకుతన్నవ్' అనడిగిండు. 'గిట్ల ఆంబోతు ఎంటబడ్డది చిన్నాయిన' అంటే, 'ఎర్ర లంగ యేసుకోవద్దె రంగి. ఆ ఆంబోతు మంచిది గాదు. పున్నానికి పాణం పోతుండె గదనె' అన్నడు. ఇగ యెన్నడు ఎర్ర లంగ యేసుకోలే బిడ్డ".

మా అమ్మ ఆగింది. ఇగ ఆగుతదేమో అని నా ఒడిలోని పుస్తకం తెరిచిన. అమ్మ అదేమి పట్టించుకోకుండా,

"మా నాయిన మా అమ్మను ఎంత బాగ జూసుకునేటోడే. మా అమ్మ నిలబడి తల పక్కకు వంచితె నేలకు ఆనెటంత జుట్టు. మా అమ్మకు ఒక్కదానికి తలకు పోసుకునేటందుకు ఆయితి గాదని కింద జుట్టు ఆస్తదని జల్లెడబెట్టి తలకు పోసేటోడు మా నాయిన. మా అమ్మ తలకు సవరుబెట్టి పువ్వుదేసుకుని నగలన్ని పెట్టుకుంటె దేవతలెక్క వుండేది. మా నాయిన ఏం మురిసేటోడు మా అమ్మను జూసి. మా అమ్మ పానా అందంగుండేది. మా అమ్మను ఒక్కనాడన్న ఇట్ల కసిరియక పోయేటోడు. రంగయ్య మావయ్య(అమ్మ తమ్ముడు) నంటి పిలగాడు. మా నాయినకు చేదగ్గు పుట్టింది. ఏం జేసినా తక్కువగాలె. చర్దుబాటు జేసింద్రని ఈ ఇంట్ల ఉండనని మా చిన్నాయిన ఇంట్లకు మారింది మా అమ్మ. అయినా తగ్గలే.మళ్లా మా ఇంట్ల కు మేం బోతమని వచ్చింది. అయినా బీమారి తగ్గలే. మళ్లా మీ ఇంట్లకు మార్తనని మా చిన్నాయినతోటి అన్నది. అప్పుడు మా చిన్నాయిన 'యాడ సక్కగ వుండనీయవు' అని మా అమ్మ షిగెంటికలుబట్టి బాయిబండ మీదకు గుంజకబోయి ఏవిగొట్టిండు. మా అమ్మ ఇడిపించుకుని ఇంట్లకు ఉరుకొస్తావుంటె గొర్రగొర్ర గుంజుకబోయి కొట్టిండు. మా రంగడు ఉయ్యాల్ల ఉంటె ఉయ్యాలకు ఉయ్యాల ఎత్తుకబోయిండు బాయిలేస్తనని.అప్పుడు పట్వారి అంతయ్య జూసి "ఓరి సాలోడ, ఆ పిలగాడయితె సావాలె. నీ సంగజ్జూస్త" అని గదమాయిస్తె బిడ్డా... నీ కాల్మొక్కుత... ఉయ్యాలను అమాంతం లేపి బాయిబండ మీద ఎత్తేసిండు. మా రంగడు కెవ్వున మొత్తుకుండు. పిల్లి పిల్లలను మార్చినట్టు మా నాయినను ఆ ఇంట్ల కు ఈ ఇంట్లకు దిప్పె. యెన్ని జేసినా మా నాయిన దక్కకపాయె. రంగనికి ఐదో నెల. మా నాయిన సచ్చిపొయిండు. అప్పట్నుంచి మా అమ్మ కన్నకష్టాలు పడ్డది. ఆఖరికి మంచి సావు సచ్చింది. భగమంతుడు సల్లగ తీస్కపొయిండు. కుర్చిల కూసున్నది కూసున్నట్టె నవ్వుకుంట సచ్చి పొయింది" అని కండ్లత్తుకుంది.

ఏవో గుర్తుకు తెచ్చుకుంటూ, బహుశ మా అమ్మమ్మ మదిల మెదిలిందేమో చేతులు పిసుక్కుంటూ తల కిందికి వేసి కూచుంది.

"అమ్మ ఆకలైతుందే"

"ముచ్చట్లపడి మర్చేపోయిన బిడ్డ. యేందోసే మా అమ్మ ఎన్నడు లేంది రాత్రి కలలకొచ్చింది" అని లేచి వెళ్లి తనకో పల్లెంల, నాకో పల్లెంల అన్నం పెట్టుకొచ్చింది. తింటున్నంతసేపు అవసరమైనవన్ని వడ్డించుతూ తనూ తిన్నది. తర్వాత ఇద్దరి పల్లాలను తీసుకుపోయి సింక్‌ల వేసి వచ్చింది. మామూలుగా అయితే అన్నం తినంగనె కాసేపు అడ్డం ఒరుగుదతి. కానీ మళ్లీ వచ్చి కూచుంది.

మాకు తీరి, మేము మా అమ్మ చెప్పె కబుర్లు విందామనుకున్నా మా అమ్మ అప్పుడు ఏ స్థితిలో వుంటదో. మళ్లీ చదువుకోవచ్చులే అని వినడానికి సిద్ధంగా కూచున్న. మా అమ్మ ఇవేవి గమనించే స్థితిలో లేదు. తన ధోరణిలో తను మళ్లీ మొదలుపెట్టింది.

"మా తమ్ముడు రంగడు బడికి పోయేటప్పుడు రోజు సద్ది గట్టి పంపేది మా అమ్మ. ఒనాడు రంగడు సద్దిమూట ఏట్ల పడేసి వచ్చిండు. సద్దిగట్టేటందుకు సూస్తె టిపిని లేదు. 'టిపినేదిరా' అని మా అమ్మ అడిగితే, 'పొయింది' అన్నడు వాడు. వాని దోస్తులుండి 'రోజు గట్క గడుతున్నవని ఏట్ల పడేసిండు పెద్దమ్మ' అని చెప్పింద్రు. మా తమ్ముణ్ని మా అమ్మ ఒక్క మాటనలే. పక్కడ పక్కడ ఏమ్ నవ్వింది. మల్ల టిపిని కొనిచ్చింది. ఏంవుంది, బేడ బెడితె టిపినొచ్చె".

"ఆ రోజుల్ల రోజు కూలి ఎంతుండేదే"

"ఆ... ఆనాడు రోజంత కూలి జేస్తే ముప్పావులా ఇచ్చేటోళ్లు" అంది. లేచి మంచినీళ్లు తాగింది. ఇవ్వాల్లన అని నన్నడిగింది. నేను అన్నం తినగానే తాగను. ఇమ్మంటె ఇచ్చింది. బాల్కనీలకు వెళ్లి మళ్లొకసారి రోడ్డెంట చూసుకుంట ఒకటి, రెండు నిముషాలు నిలబడింది. వచ్చి కుర్చిల కూచుంది.


"మంగమ్మ పెద్దమ్మ మంచంల పడ్డది, లేస్తలేదని తెలిసి చూసొద్దమని పొయినబిడ్డ. కట్టెపుల్లోదిగ అయ్యి మంచానికి అంటుకపొయింది. దుఃఖమాగలే నాకు. మా అక్కకు బిడ్డ గట్క పెడ్తుందట. దానికి ఒక్కదన్న మగపిలగాడు లేకపాయె. కన్నకూతలు అల్లుడు, బిడ్డ కూస్తరట. చెప్పుకొని ఏడ్చింది. చిన్నతనాన మా అక్కకు, మా అన్నకు మా అమ్మ ఒరన్నమే పెట్టేది. పెండ్లయి అత్తగారింటికి తోలినా ఎవ్వరొస్తె ఆళ్లెంటబడి అమ్మమ్మ దగ్గరికి వచ్చేది - అత్తగారింట్ల గట్క తినలేక. ఒకసారి నేను పొయ్యి వదలిపెట్టిన 'కట్టవరకు తొలొస్త పా చెల్లె' అని నా యెనకాలబడి మల్ల వచ్చింది. ఇక మా అమ్మే యేగలేక నడుముకు తాడు గట్టింది బాయిల దించుతనని. మా నాయినమ్మ జూసి తిట్టింది. ఆ అయ్య కాలు ఈ అయ్య కాలు బట్టుకున్నట్టు తిప్పలబడి పెండ్లి జేస్తె మా అక్క ఇట్ల జేస్తుండె. మా అక్క అంటె మా అమ్మకు పాణం. గని ఏం జేస్తది. ఇట్లనే వస్తె వాళ్లు వదిలి పెడ్తరేమో అని మా అమ్మ బయం. అట్లాంటిది సావుదలకు మా అక్కకు బిడ్డలు గట్క పెట్టింద్రు. మా అక్క చెప్తుంటె ఏం బాధయిందె. యేడికన్నబోతె కట్టుకుందువు అని నాదే ఓ కొత్త చీర ఇచ్చిన. ఓ ఐదొందలు చేతిల బెట్టిన. మాసొచ్చి హైదరాబాదు జేరిన్నో లేదో యెంటనే సచ్చిపోయిందని ఫోను జేసింద్రు.

"ఆళ్లిచ్చినయి, ఈళ్లిచ్చినయి పైన పైన ఓ పండు తినక, ఓ ఫలం తినక పద్దెనిమిదివేలు కూడబెట్టిందట - సచ్చిపోతే దినాల ఖర్చుకొస్త యని. ఆటిని బెట్టే దినాలు జేసింద్రు. పాయిరి. అందరు పాయిరి. మా అన్నబాయె, మా అక్క బాయె, మా పెద్ద తమ్ముడు తాగి తాగి ఆడు బాయె. ఇంగ నేను, రంగడు మిగిల్తిమి..." అని దిగాలుగ ఏం మాట్లాడకుండా కూర్చుంది. నేనూ ఆలోచిస్తూ అలాగే వుండిపోయిన. కాస్సే పాగి,

"నాకు ఆపరేషన్ అయినపుడు చిన్నోడు కిట్టి మంచం దగ్గర్నే ఏడు సుకుంట నిలబడ్డడు కొడ్క. ఆనికి ఐదేండ్లు వుంటయేమో అప్పుడు. నేను కండ్లు తెరుస్తున్న. గని, మళ్ల మూతలు పడుతున్నయ్. 'మీ అమ్మకు యేంకాదు యేడ్వకు బాబు' అని సూద్దానికి వచ్చిన డాక్టరమ్మ అన్నది. అన్ని యినబడ్తనేవున్నయ్, గని కండ్లు తెరవస్తలేదు. కొడ్కు ఎన్ని గంటలో... నన్నే సూసుకుంట, ఏడ్సుకుంట నిలబడ్డడు. ఏవి ఆలోచించుకుండో కొడ్కు. మత్తుతోటి పిలుద్దామంటే నోరొస్త లేదాయె. రెప్పలేమో నిలుస్తలేవాయె. మూతలు పడ్తున్నయి. యమధర్మరాజు భటుల్ని పంపించిండు. మెడకు తాడేసింద్రు. తాడును రెండు చేతులతోటి గట్టిగ బట్టుకుని 'నాకు పిల్లలున్నరు. నా పిల్లలు ఆగమయితరు. నేను రాను' అని ఎంతసేపు కొట్లాడిన బిడ్డ. ఆకరికి 'మొండిదని' యమభటులు వదిలేసి పొయింద్రు. ఆనాడే పొయ్యుంటె ఈనాడు కొడుకులచేత యిన్ని మాటలు బడకపోతుంటి".

ఇక మా అమ్మ ఇందులోకి దిగిందంటే అయిపోయినట్లె. అందుకే "ఇది ఒడిసే ముచ్చట గాదులేవే" అని కసురుకున్న. తలుచుకొని తవ్విపోసుకుంటె బాధ పెరిగేదే కానీ తరిగేది కాదు. ఆపకపోతే ఒగదాని తర్వాత ఒకటి వస్తనే వుంటది. చిన్నబుచ్చుకుని "పొద్దుపోయింది కదనె. ఛాయ్ పెడ్త" అని వంటింట్లకు పొయింది.

అమ్మని ఎన్ని మాటలన్నా ప్రేమగా పలకరిస్తే చాలు ఏడుస్తది. అప్పటివరకు అన్న మాటలన్నింటిని మర్చిపోతది. అమ్మ అమ్మే.



మా నాయిన మా అమ్మను ఎంత బాగ జూసుకునేటోడే. మా అమ్మ నిలబడి తల పక్కకు వంచితె నేలకు ఆనెటంత జుట్టు. మా అమ్మకు ఒక్కదానికి తలకు పోసుకునేటందుకు ఆయితి గాదని కింద జుట్టు ఆస్తదని జల్లెడబెట్టి తలకు పోసేటోడు మా నాయిన.